క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధర పురం రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, చిట్టినగర్ సెక్షన్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11కేవీ జనప్రియ, కంసాలిపేట ఫీడర్ల విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్ కారణంగా శనివారం ఉదయం ఆయాప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు స్థానిక డీఎస్ఎమ్సీ స్కూల్ ఏరియా, కుమ్మరి పాలెం సెంటర్లోని కొట్టేటి కోటయ్య వీధి, రావి చెట్టు సెంటర్, ఆళ్ల సింహాద్రి వీధి, తాజ్ మసీదు వీధి, ఇస్మాయిల్ వీధి, లోటస్ అపార్ట్ మెంట్ ఏరియా, ఓల్డ్ మసీదు ఏరియా, బీరువాల కంపెనీ, జేపీ అపార్ట్మెంట్ 35 గజాలు, ఉర్దూ స్కూల్, కంసాలి పేట ప్రాంతాల్లో విద్యుత్సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

25నుంచి మహాశివరాత్రి మహోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):శ్రీవిజయ దుర్గా రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో 25వ తేదీ నుంచి మహాశివరాత్రి మహోత్సవాలు ప్రారంభంకానున్నాయని ఆలయ అర్చకులు చింతలపాటి వెంకటసుబ్రహ్మణ్య శాస్త్రి తెలిపారు. 25వ తేదీన గంగా పార్వతి(విజయదుర్గా) రామలింగేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు, స్వామివార్లను పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తెగా అలంకరిస్తామన్నారు. 26వ తేదీ తెల్లవారుజామున 5 గంటల నుంచి 12 గంటల వరకు అభిషేకాలు, రాత్రి 12 గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరుగుతుందన్నారు. 27వతేదీ సాయంత్రం గంగా పార్వతి సమేత దుర్గా రామలింగేశ్వర స్వామివారికి పవళింపు సేవ, 29వ తేదీ ఉదయం 9గంటలకు చండీహోమం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, 12 గంటలకు పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. స్వామివారి కల్యాణోత్సవంలో అధికసంఖ్యలో భక్తులు, ఉభయదాతలు పాల్గొనాలని ఆయన కోరారు.

డివైడర్ల వద్ద జాగ్రత్త!



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే బీఆర్టీఎస్ రోడ్డు డివైడర్ల వద్ద జాగ్రత్తగా ఉండాల్సిందే. ఇక్కడ ఎవరికి వారు తమ ప్రాంతంలోకి సులభంగా వెళ్లడానికి డివైడర్లను పగలకొట్టి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో బీఆర్టీఎస్ రోడ్డులో వేగంగా వస్తున్న వాహనచోదకులు ఒక్కసారిగా పక్కన డివైడర్ల నుంచి వస్తున్న వాహన చోదకులను ఢీ కొడుతున్నారు. శుక్రవారం ఉదయం రామకోటి మైదానం సమీపంలోని బీఆర్టీఎస్ రోడ్డు డివైడర్ నుంచి వస్తున్న వాహన చోదకుడు అదే రోడ్డులో ప్రయాణిస్తున్న వసంతకుమార్ను ఢీ కొట్టబోయాడు. ఇద్దరూ వాహనానికి సడన్ బ్రేకులు వేయడంతో ప్రమాదం తప్పింది. నిత్యం ఇదే తరహాలో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా రామకోటి మైదానం, భానునగర్ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. అధికారులు స్పందించి డివైడర్లను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కార్మికులకు అన్యాయం జరిగితే సహించం

వన్టౌన్(విజయవాడపశ్చిమ): కాంట్రాక్టు పేరుతో పారిశుద్ధ్య కార్మికులకు అన్యాయం చేస్తే సహించబోమని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి బుద్దె రాజా, అధ్యక్షులు ఎస్వీఎస్ చలం హెచ్చరించారు. 37వ డివిజన్శానిటరీ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్నర్ మీటింగ్లో వారు పాల్గొని మాట్లాడారు. కార్మిక వర్గానికి న్యాయం చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు కాంట్రాక్ట్ పేరుతో పారిశుద్ధ్య కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తుందన్నారు. అనేక సమస్యలతో పారిశుద్ధ్య కార్మికులు జీవనం సాగిస్తూ ఉంటే వారి సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి ఇంకా సమస్యలను సృష్టించడం ఏమాత్రం తగదన్నారు. స్వచ్ఛ విజయవాడగా తీర్చిదిద్ది దేశంలోనే విజయవాడ నగరాన్ని క్లీన్ సిటీగా నిలబెడుతున్న పారిశుద్ధ్య కార్మికులకు అన్యాయం చేయడం తగదని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ పేరుతో జీతాలు తగ్గించాలని చూస్తే కార్మికవర్గం ఊరుకోదని హెచ్చరించారు.

ఓవర్టేక్ చేస్తూ ప్రమాదానికి గురైన కారు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ఇబ్రహీంపట్నం వైపు నుంచి విజయవాడ వెళుతున్న లారీని కారు ఓవర్ టేక్ చేయబోయింది. డ్రైవర్ తప్పిదంతో కారు ఎడమ వైపు భాగం లారీ కుడివైపు ఢీకొట్టింది. కారు రోడ్డుకు అడ్డంగా తిరిగింది. లారీ డ్రైవర్ బ్రేక్ వేయడంతో కారుపైకి లారీ దూసుకెళ్లకుండా ఆగిపోయింది. కారులో ఉన్న వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షమించమ్మా.. తెలుగుతల్లి!

- కళాక్షేత్రం ప్రాంగణంలో మూలన పడేసి ఉన్న తెలుగుతల్లి విగ్రహం
- పట్టించుకోని వీఎంసీ అధికారులు



కళాక్షేత్రం ప్రాంగణంలో చెట్ల మధ్య కళావిహీనంగా ఉన్న తెలుగుతల్లి విగ్రహం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం ప్రాంగణంలో మూలనపడేసి ఉన్న తెలుగుతల్లి విగ్రహాన్ని పాలకులు, వీఎంసీ అధికారులు విస్మరించడంపై తెలుగు భాషాభిమానులు మండిపడుతున్నారు. కళాక్షేత్రం ప్రాంగణంలోని వాటర్ ఫౌంటెన్ ముందు ఉన్న ఈ నిలువెత్తు తెలుగుతల్లి విగ్రహాన్ని 2016లో కృష్ణా పుష్కరాల సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆధునీకరణ పేరుతో అక్కడ్నుంచి తొలగించి పక్కనే ఉన్న చెట్ల మధ్య పడేశారు. కళాక్షేత్రం అప్పట్నుంచి ఈ తెలుగు తల్లి విగ్రహం ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కళాహీనంగా మారింది. ఆధునీకరణ పేరుతో ఆ విగ్రహాన్ని తొలగించిన అప్పటి పాలకులు వాటర్ ఫౌంటెన్ను మాత్రం అలానే ఉంచడం గమనార్హం. ఆధునీకరణ పనులు పూర్తయ్యాక ఆ విగ్రహాన్ని యథాస్థానంలో నిలపాల్సిన పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా తెలుగుతల్లి విగ్రహం నిరాదరణకు గురైంది. దశాబ్దకాలంగా కళాక్షేత్రంలో జరిగే అనేక కార్యక్రమాల నేపథ్యంలో నాటినుంచి నేటి వరకు పలువురు ప్రముఖులతోపాటు అనేక సాహితీ, కళాసంస్థల నిర్వాహకులు, తెలుగు భాషాభిమానులు రాకపోకలు సాగిస్తూనే ఉన్నారు. అయినా ఏఒక్కరూ ఈ తెలుగు తల్లి విగ్రహాన్ని పట్టించుకోలేదు. కళాక్షేత్రం బయట ఏర్పాటు చేసిన తెలుగుతల్లి విగ్రహానికి అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం రోజున మాత్రం కొందరు మొక్కుబడిగా దండేసి ఫొటోలు దిగి వెళ్లిపోతున్నారు తప్ప లోపల ఉన్న తెలుగుతల్లి విగ్రహాన్ని మాత్రం విస్మరించారు. కళాక్షేత్రం నిర్వహణ బాధ్యతలు చూసే నగరపాలక సంస్థ అధికారులు ఇప్పటికైనా స్పందించి తెలుగు తల్లి విగ్రహాన్ని ఫౌంటెన్ వద్ద యథాస్థానంలో ఏర్పాటు చేయాలని తెలుగు భాషాభిమానులు కోరుతున్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



ప్రాచీన, ఆధునిక కవులు, రచయితల పేర్లు ఉన్న ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



ప్రతిభచూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఎన్వీ రావు

భవానీపురం(విజయవాడపశ్చిమ):ప్రాంతీయ దేశ భాషల్లో సమున్నతమైన తెలుగుభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగువారిపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం, డీఎస్ఎమ్సీ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన పలువురు ప్రముఖుల చిత్రాలను విద్యార్థులు ప్రదర్శించారు. తెలుగుభాషకు సంబంధించిన వివిధ రూపకాలను వినూత్నంగా ప్రదర్శించారు. ప్రాచీన, ఆధునిక రచయితల పేర్లుగల ప్లకార్డ్లను ధరించి వారి విశిష్టతను వివరించారు. తెలుగు పండిట్లు నాగఅనసూయ, కొండలరావు, రత్నబాబు పద్యాలను ఆలపించి అందరిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఏపీ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, అరసం బాధ్యులు అరసవిల్లి కృష్ణ, సీనియర్ పాత్రికేయులు చెన్నాప్రగడ శర్మ, రచయిత్రి కోపూరి పుష్పాదేవి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు చిన్ననాటి నుంచే శతక పద్యాలు, నీతి కథలు, సామెతలు, పొడుపు కథలు నేర్పించాలన్నారు. తొలుత మాతృభాష వస్తేనే భవిష్యత్లో ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. అముక్త మాల్యద గ్రంథాన్ని తెలుగు భాషలో రచించిన శ్రీకృష్ణదేవరాయులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కాగా తెలుగు భాషా ఉత్సవాలకు సంబంధించి నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు లత, శారద, వాణి, కిరణ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషపై ప్రావీణ్యం సాధించాలి....

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):మాతృభాషపై ప్రావీణ్యం సాధించడం ద్వారా విద్యార్థులు మిగిలిన భాషలను సులభంగా నేర్చుకోవచ్చునని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు సూచించారు. కేఎల్రావునగర్లోని రాకేష్ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్ కోఆర్డినేటర్ రమేష్, ప్రోగ్రాం కన్వీనర్ షకీలా, ఉపాధ్యాయులు అభినందించారు.

పేదరికం నిర్మూలించాల్సిన బాధ్యత పాలకులదే

చర్చావేదికలో సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేదరికాన్ని నిర్మూలించాల్సిన బాధ్యత పాలకులదేనని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, శ్రీనివాసరావు చెప్పారు. సంక్షేమ పథకాలతో వ్యవసాయ కార్మికులు సోమరి పోతులుగా మారుతున్నారని, ఉపాధి హామీతో కూలీలు దొరకడం లేదని దేశ ఉన్నత న్యాయమూర్తులు, కొందరు పెద్దలు చేస్తున్న వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని చర్చావేదిక డిమాండ్ చేసింది. శుక్రవారం విజయవాడ ప్రెస్క్లబ్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీల వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు సోమరిపోతులుగా మారిపోతున్నారంటూ కార్పొరేట్లు, న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకవాలని కోరుతూ చర్చవేదిక జరిగింది. పల్లెల్లో వ్యవసాయ సంక్షోభం, ఆహారపంటల స్థానంలో వాణిజ్యపంటలు రావడం అన్ని పనుల్లో యంత్రాలు వల్ల కూలీలకు పనులు లేక నిత్యం వలసలు పోతూ ప్రమాదాల్లో చనిపోతున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు 26శాతానికి పైగా పెరిగాయన్నారు. వేదికలో మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, బి.వెంకటేశ్వర్లు, ఆవుల శేఖర్బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎరి(కల్) ముత్తురాజు విగ్రహం ఏర్పాటు చేయాలి

తొలి తెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన కేంద్రం



ముత్తురాజు ధనంజయుడి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తొలి తెలుగు శాసనాన్ని చెక్కించిన రేనాటి చోళరాజు ఎరి(కల్) ముత్తురాజు ధనంజయుడి విగ్రహం అసెంబ్లీ ఎదుట ప్రతిష్ఠించాలని వక్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విజయవాడ ప్రెస్క్లబ్లో తొలి తెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన సంఘం ఆధ్వర్యాన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరిగింది. తొలుత తొలి తెలుగు శాసనకర్త ముత్తురాజు ధనంజయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు పిల్లి లక్ష్మీ తులసి మాట్లాడుతూ తెలుగును రాజభాషగా కొనసాగించి అభివృద్ధి చేసిన రేనాటిచోళమహారాజుల చరిత్రను ఉన్నతవిద్యలో ఒక పాఠ్యాంశంగా చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ముత్తురాజుకు భారత రత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలన్నారు. వ్యవస్థాపక అధ్యక్షులు పీవీఎల్ఎస్ రాజు మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఏప్రిల్ 20న హైదరాబాద్లో తెలుగు పుట్టుక – వ్యాప్తిపై మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్కార భారతి అధ్యక్షులు పీవీఎస్ కృష్ణ, వెలగా జోషి, పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు, కె.జయరాజు, చింతా వెంకటేశ్వర్లు, చింతకాయల చిట్టిబాబు, తొలి తెలుగుదివ్వె ప్రధాన కార్యదర్శి ఎస్. ఉదయ భాస్కర్, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతి రావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులే తొలి గురువులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జీవితంలో తొలి గురువులైన తల్లిదండ్రులను ఎవ్వరూ విస్మరించరాదని, వారిని గౌరవిస్తేనే భవిష్యత్ వికసించి ఉన్నత స్థానానికి ఎదుగుతారని శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ సత్యచిత్ర పేర్కొన్నారు. స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా భవానీపురంలోని శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం 'ఫ్యామిలీ బ్లూమ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు, అవ్వాతాతల పాదాలకు నమస్కరించి వారు సొంతంగా తయారు చేసిన చిన్నపాటి బహుమతులను బహూకరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. స్కూల్ ప్రిన్సిపాల్ సత్యచిత్ర మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత పెద్దలపై ఉందని సూచించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ రామారావు, కోఆర్డినేటర్ చక్రధర్ ప్రసాద్, డీన్ రంగారావు, సీబ్యాచ్ ఇన్చార్జ్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజన పెంపునకే..

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్రం, చరిత్ర శాఖ అధ్యాపకులు నాగార్జునసాగర్లోని నాగార్జునకొండకు స్టడీ టూర్లో భాగంగా 50 మంది విద్యార్థులను తీసుకువెళ్లి మ్యూజియాన్ని సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి ప్రతి విభాగం వారు, విద్యార్థులను స్టడీ టూర్ తీసుకువెళ్లి అక్కడ ప్రదేశాలను చూపిస్తూ ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ కొల్లేటి రమేష్, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగ అధిపతి శ్రీ పద్మనాభం, చరిత్ర శాఖ అధ్యాపకులు డాక్టర్ అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

విజయవాడలీగల్: న్యాయవాదులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం వారి పాలిట శత్రువుగా మారిందని పలువురు న్యాయవాదులు ఆరోపించారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. న్యాయవాదుల చట్టం -1961లో గణనీయమైన మార్పులను ప్రతిపాదిస్తూ న్యాయవాదుల (సవరణ) బిల్లు, 2025ను న్యాయ వ్యవహారాల శాఖ ఆవిష్కరించడం న్యాయవాదులకు శిరోఘాతంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో వ్యయ ప్రయాసలు ఓర్చి, బాధితులకు సత్వర న్యాయం చేయడానికి తమ సమయాన్ని వెచ్చిస్తుంటే, కేంద్ర ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ కల్పించాల్సి ఉంది. ఇందుకు భిన్నంగా న్యాయవాదుల చట్టాన్ని సవరించి, రక్షణ లేకుండా చేస్తోందని మండిపడ్డారు. న్యాయవాదులకు జరిగే అన్యాయంపై వారు అనేకరకాలుగా నిరసనలు తెలియజేస్తుంటారు. అయితే ఈ కొత్త చట్టం ప్రకారం న్యాయవాదులు ఇక తమకు జరిగే అన్యాయాలను ధర్నాల ద్వారా బహిర్గతం చేయకుండా నియంత్రిస్తుంది. న్యాయవాదుల స్వేచ్ఛను కాలరాస్తూ, హక్కులు, విధులను నియంత్రించడానికి పూర్తి అధికారాలను కేంద్రం తీసుకుంటుందని పలువురు వాపోతున్నారు.

న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

న్యాయవాదులకు చట్టాలు రక్షణ కల్పించాల్సింది పోయి న్యాయవాదుల్ని బాధితులుగా చేయడం చాలా దుర్మార్గమని వైఎస్సార్ సీపీ లీగల్ జోన్ ఇన్చార్జి ఒగ్గు గవాస్కర్ అన్నారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

భార్య కనిపించడంలేదని ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): భార్య కనిపించడం లేదని నున్న పోలీసుస్టేషన్లో మద్దాల శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.ఏపీఎస్రెడ్డి రోడ్డులో నివసిస్తున్న శ్రీకాంత్ భార్య భవాని స్థానిక మహిళ వద్ద డబ్బులు తీసుకొంది. ఆ మహిళ డబ్బులు తిరిగి చెల్లించాలని గట్టిగా అడుగుతుండటంతో గురువారం నుంచి కనిపించడం లేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెదికినా ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఎస్ఆర్ఆర్ స్థలాన్ని పరిరక్షించాలంటూ సీఎంకు బహిరంగ లేఖ

మధురానగర్(విజయవాడసెంట్రల్): కబ్జా కోరల్లో చిక్కుకున్న మాచవరం ఎస్ఆర్ ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలకు చెందిన 6.67 ఎకరాల స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి, కళాశాల పూర్వ విద్యార్థి దోనేపూడి శంకర్ సీఎం చంద్రబాబునాయుడికి బహిరంగ లేఖ రాశారు. ఎన్టీఆర్తో సహా ఎందరో ప్రముఖులు ఇక్కడ చదివారని తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన కళాశాల యాజమాన్యం 'నిమ్మకు నీరెత్తినట్లు'గా వ్యవహరిస్తోందని విచారం వ్యక్తం చేశారు. 'ఎస్ఆర్ఆర్' పూర్వ విద్యార్థుల సంఘం కళాశాలకు చెందిన రూ. 250 కోట్ల విలువైన స్థలం పరిరక్షణకు ఎనిమిదేళ్లుగా కబ్జాదారులపై ప్రత్యక్ష పోరాటం, న్యాయ పోరాటం చేస్తూ ఉందన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశంలో దీనిపై చర్చించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

పెనమలూరు: పెనమలూరు గ్రామం హైస్కూల్ సెంటర్లోని శ్రీకోదండరామాలయంలో స్వామివార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో మూడు రోజులపాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

మాతృభాషతోనే మనోవికాసం



తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద వివిధ రంగాలకు చెందిన వారిని సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: మాతృభాషతోనే మనోవికాసం కలుగుతుందని శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. తెలుగు కళావాహిని శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్కే సాంస్కృతిక సమితి ఆధ్వర్యాన శుక్రవారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, వివిధ రంగాల వారికి ఆత్మీయ సత్కారం చేశారు. ఆయన మాట్లాడుతూ భాష పరిపుష్టికి కవులు, రచయితలు కృషి చేయాల్సిన అవసముందన్నారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ మాతృభాషలో పాలన సాగాలన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో భారత మహిళామండలి కార్యవర్గ సభ్యులు ఆర్.లక్ష్మీదేవి, పి.శశిరేఖ, వి.కామేశ్వరి, శచీదేవి, ఎ.రత్నలక్ష్మి, టి.సాయిలక్ష్మి, జీవీఎల్ కుమారి, సాహితీవేత్త బసవరాజు రామ్మోహనరావును సత్కరించారు గాయకుడు డేవిడ్రాజు, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వంటల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న న్యాయనిర్ణేత విజయశ్రీ

వన్టౌన్(విజయవాడపశ్చిమ):విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో పట్టు సాధించాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్సుధీర్ సూచించారు. కళాశాల ప్రాంగణంలో మేనేజిమెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'చెఫ్ప్రెన్యూర్ చాలెంజ్' పేరుతో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు వంటల పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన చిట్టా అమర్ సుధీర్, న్యాయనిర్ణేత విజయశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు నేడు అనేక రంగాల్లో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిభ, సృజనాత్మకతతో ముందుకు సాగితే అన్ని రంగాల్లోనూ చక్కని విజయాలను సొంతం చేసుకోవచ్చన్నారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలకు పదును పెట్టి శ్రమిస్తే విజయాలు సొంతమవుతాయని వివరించారు. పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో సుమారు 12బృందాలు పాల్గొని చక్కని వంటకాలను ప్రదర్శించి తోటి విద్యార్థులను ఆకట్టుకున్నారు. వివిధ వంటకాలతో సందడి చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శరవణకుమార్, విభాగాధిపతి డాక్టర్ ఎస్ మణికంఠ, కన్వీనర్ ఎస్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పంపింగ్ స్టేషన్ను అందుబాటులోకి తీసుకురావాలి



భవానీపురంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): భవానీపురం హెచ్.బి. కాలనీలోని డ్రైనేజీ పంపింగ్ స్టేషన్ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన ఐరన్ యార్డ్, ఎట్కిన్సన్ స్కూల్ రోడ్డు, ఊర్మిళ సుబ్బారావు రోడ్డు, జోజినగర్, గొల్లపూడి బైపాస్ రోడ్డు, సితార రోడ్డు, హెచ్బీ కాలనీ, సీపీఆర్ ఫ్లైఓవర్, న్యూ భగత్ సింగ్ నగర్, బ్రహ్మయ్య స్ట్రీట్, ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హెచ్బీ కాలనీలోని డ్రైనేజీ పంపింగ్ స్టేషన్కు సత్వరమే మరమ్మతులు చేయించి, త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నిత్యం సైడ్ డ్రైన్లను పరిశుభ్రపరుస్తుండాలని, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కల్వర్టులకు మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట రిటైనింగ్ వాల్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఇన్చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఈఈ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులు క్రమశిక్షణతో మెలగాలి

డీటీసీ మోహన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆటో కార్మికులు క్రమశిక్షణతో ఉండాలని, లైసెన్స్, యూనిఫాం, డాక్యుమెంట్స్ తప్పనిసరిగా ఉండాలని డీటీసీ మోహన్ అన్నారు. విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సి.ఐ.టి.యు) రైల్వేస్టేషన్ 19వ మహాసభ శుక్రవారం హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగితే తోటి కార్మికులు ఆ కార్మికుడు ప్రాణాలు కాపాడి ప్రోత్సాహకాలు పొందాలని సూచించారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తెస్తే అవకాశం ఉన్నంత వరకు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సీపీఎం నేత సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా మోటార్ రంగం తీవ్ర సమస్యలు ఎదుర్కొంటోందన్నారు. సమస్యల పరిష్కారానికి ఆటో కార్మికులు ఐక్యంగా పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. మహాసభలో విజయవాడ సిటీ ఆటోవర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్, ప్రశాంతి హాస్పటల్ జనరల్ సర్జన్ డాక్టర్ ఎం.రవీంద్రారెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ ఎ. ఉదయ శివప్రసాద్ , విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు, ఎం.వి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

- అనంతరం 33 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రైల్వే స్టేషన్ ఏరియా ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఎస్.కె దుర్గావలి, అధ్యక్ష కార్యదర్శులుగా ఎ.వి.రెడ్డి, డి. కోటయ్య, ఉపాధ్యక్షులు ఎస్కే రఫీ, కోరుకొండ శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు ప్రభుదాసు, ఎస్కే నాగూర్, ఆర్. సుబ్బరాజు ఎన్నికయ్యారు.

తెలుగుతల్లికి నృత్య నీరాజనం



సంప్రదాయ నృత్యరీతులను ప్రదర్శిస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: ఏపీ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ సృజనాత్మక సమితి ఆధ్వర్యాన దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల నృత్య అధ్యాపకులు సీహెచ్ అజయ్కుమార్, భాగవతుల సౌమ్య ఆధ్వర్యంలో చిన్నారులు నృత్య నీరాజనాలను అందించారు. సంగీత అధ్యాపకురాలు, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసమ్మ, మల్లాది కార్తీక త్రివేణి బృందం బాల బాలికలు ప్రబోధాత్మక గీతాలను మధురంగా ఆలపించారు. తెలుగు భాష కోసం కృషి చేసిన డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, వలివేటి శివరామకృష్ణ, డాక్టర్ ధూళిపాళ రామకృష్ణ, డాక్టర్ జీవీ పూర్ణచందు, డాక్టర్ యశోద పూర్ణచంద్రరావు మాతృభాషా వికాసం- మన కర్తవ్యం అంశంపై ప్రసంగించారు. సృజనాత్మక సమితి సీఈవో ఆర్ మల్లికార్జునరావు తోపాటు కళాశాల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

- రంగం ప్రజాసాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.